
నందిగామలో జరిగిన భారీ ర్యాలీలో పాల్గొన్న అశేష జనవాహిని

అడుగడుగునా నీరాజనం

నందిగామలో ఎగసిన జనకెరటం

- ధర్మ యుద్ధానికి సై అంటూ కదిలొచ్చిన ప్రజానీకం
- అట్టహాసంగా వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జగన్‌మోహనరావు నామినేషన్
- ఎడ్లబండిపై భారీ ర్యాలీగా తరలివచ్చిన వైనం
- పాల్గొన్న విజయవాడ వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని

నందిగామ: నందిగామ చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో తరలివచ్చిన అశేష జనవాహినితో నందిగామ పట్టణం జన సంద్రమైంది. మండుటెండను సైతం లెక్కచేయకుండా ఇసుక వేసినా రాలనంత మంది జనం తరలి రావడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. చివరకు ప్రత్యర్థులు సైతం నిశ్చేష్టులయ్యారంటే.. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఏ స్థాయిలో తరలివచ్చారో అర్థం చేసుకోవచ్చు. బుధవారం ఉదయం ప్రారంభమైన కోలాహలం మధ్యాహ్నం వరకు కొనసాగింది. ఏ దారి చూసినా జనంతో నిండిపోయింది. కనుచూపు మేరలో వైఎస్సార్ సీపీ జెండాలే దర్శనమిచ్చాయి. మోటార్ సైకిళ్లు, ట్రాక్టర్లు, ఆటోలు, కార్లు.. ఇలా ఎవరికి అందుబాటులో ఉన్న వాహనంలో ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావడం విశేషం. మహిళలు సైతం రెట్టించిన ఉత్సాహంతో నృత్యాలు చేసి, ఈలలు వేసి కార్యక్రమానికి కొత్త ఊపు తీసుకువచ్చారు.

ఎడ్ల బండిపై సందడి చేసిన నాయకులు..

స్థానిక కాకాని నగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమైంది. వైఎస్సార్ సీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని), ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్, మంగునూరు కొండారెడ్డి తోపాటు మరికొందరు స్థానిక నాయకులతో కలసి ప్రత్యేకంగా సిద్ధం చేసిన ఎడ్ల బండిపై సాగారు. పార్టీ కార్యాలయం నుంచి సీఎం రోడ్డు, జాతీయ రహదారి, ప్రభుత్వాస్పత్రి రోడ్డు, మెయిన్ రోడ్డు, ట్రావెలర్స్ బంగళ రోడ్డు మీదుగా గాంధీ సెంటరుకు చేరుకున్నారు.

తరలివెళ్లిన కంచికచర్ల నాయకులు

కంచికచర్ల: మండలంలోని గండేపల్లి గ్రామం నుంచి ఎడ్ల బండిని ముస్తాబు చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి నామినేషన్ ఎడ్ల బండిపై ఎక్కి పార్టీ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు నామినేషన్‌కు వెళ్లారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షుడు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్‌బాబు, సర్పంచి వేల్పుల సునీత, అమర్లపూడి యోహాన్, మాడుగుల మధుబాబు ఆధ్వర్యంలో కంచికచర్ల నుంచి నామినేషన్‌కు తరలివెళ్లారు. అదేవిధంగా మండలంలోని పరిటాల నుంచి చింతా రవీంద్రనాథ్, సర్పంచి యద్దనపూడి ఆనందజ్యోత్స్న, మార్త శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.


సీఎం జగన్ ఫొటో చూపిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

జగన్‌మోహనరావు నామినేషన్ దాఖలు

నందిగామ: వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు బుధవారం రెండు నామినేషన్ సెట్‌లను దాఖలు చేశారు. ఆయన నామినేషన్ పత్రాలను ఉదయం 11:08 నిమిషాలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఏ. రవీంద్రరావుకు అందజేశారు. ఆయన వెంట పార్టీ సీనియర్ నాయకులు కోవెలమూడి వెంకటనారాయణ, మంగునూరు కొండారెడ్డి, వీరులపాడు ఎంపీపీ కోటేరు లక్ష్మి ఉన్నారు.

తరలిన శ్రేణులు..

వీరులపాడు: నందిగామలో నిర్వహించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు నామినేషన్ కార్యక్రమానికి బుధవారం మండలంలోని ఆయా గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. పెద్దాపురం గ్రామంలో నామినేషన్ కార్యక్రమానికి తరలుతున్న పార్టీ శ్రేణులను ఎంపీపీ కోటేరు లక్ష్మీ, పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, మండల సచివాలయ కన్వీనర్ కోటేరు ముత్తారెడ్డిలు జెండా ఊపి ప్రారంభించారు.


ఎడ్లబండిపై వస్తూ ప్రజలకు అభివాదం చేస్తున్న అభ్యర్థులు జగన్ మోహనరావు, కేశినేని నాని


పార్టీ శ్రేణులతో కలిసి ముందుకుసాగుతున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

సర్వమత ప్రార్థనలు..

నందిగామ టౌన్: వైఎస్సార్ సీపీ నందిగామ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు నామినేషన్ సందర్భంగా ఆయన నివాసంలో సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. దీనిలో భాగంగా నిర్వహించిన గణపతి పూజ, పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలను అర్చకులు జగన్‌మోహనరావు దంపతులతో చేయించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆ తర్వాత క్రైస్తవ, ముస్లింలు మత పెద్దలు కూడా మరోసారి శాసనసభ్యునిగా విజయం సాధించాలని కోరుతూ ప్రార్థనలు చేశారు. అనంతరం నివాసం నుంచి ర్యాలీగా పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. నాయకులు కోవెలమూడి వెంకట నారాయణ, కరిముల్లా, పలువురు నాయకులు, పాస్టర్లు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.


నందిగామలో జరిగిన భారీ ర్యాలీలో పాల్గొన్న జనాలతో కిక్కిరిసిన రోడ్డు

పోటెత్తిన ప్రజాభిమానం

ప్రభంజనమై కదిలిన జగ్గయ్యపేట

- కోలాహలంగా వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉదయభాను నామినేషన్
- అనంతరం భారీ ర్యాలీ, బహిరంగ సభ
- పాల్గొన్న ఎంపీ అయోధ్యరామిరెడ్డి, విజయవాడ వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని


జగ్గయ్యపేటలో ర్యాలీలో భారీగా పాల్గొన్న జనాలతో కిక్కిరిసిన రహదారి

జగ్గయ్యపేట: పేటలో జనవాహిని ప్రభంజనమై ప్రవహించింది. ప్రజాభిమానం పెద్ద పెట్టున తరలి వచ్చి నీరాజనం పలికింది. బుధవారం వైఎస్సార్ సీపీ అభ్యర్థి సామినేని ఉదయభాను నామినేషన్ కార్యక్రమం అట్టహాసంగా సాగింది. కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా భారీగా జనం తరలి వచ్చారు. వైఎస్సార్ సీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, రాజ్యసభ్యుడు అయోధ్య రామిరెడ్డి, మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోనరావు పాల్గొన్నారు. నామినేషన్‌కు ముందు ఉదయభాను పట్టణంలోని వినాయకుని ఆలయం, వేదాద్రి గ్రామంలోని యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయభాను గృహం నుంచి బంగారపు కొట్లు సెంటర్, బలుసుపాడు రోడ్డు మీదుగా పాత మున్సిపల్ సెంటర్ వరకు వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రచార వాహనంపై ఎమ్మెల్యే అభ్యర్థి ఉదయభాను, విజయవాడ ఎంపీ అభ్యర్థి నాని ప్రజలకు అభివాదం చేస్తూ ర్యాలీని ముందుకు సాగించారు. మార్గ మధ్యలో నాయకులు, కార్యకర్తలు క్రేన్ ద్వారా గజమాలతో పాటు వివిధ రకాల పండ్లతో తయారు చేసిన గజమాలతో వారిని సత్కరించారు. ర్యాలీ పాత మున్సిపల్ సెంటర్ వరకు సాగింది. ఉదయం తహసీల్దార్ కార్యాలయంలో ఉదయభాను నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను ఆర్వో వెంకటేశ్వర్లుకు అందజేశారు. ర్యాలీలో డప్పు వాయిద్యాలకు అనుగుణంగా మహిళలు దారి పొడవునా నృత్యాలు చేశారు. అన్ని వర్గాల ప్రజలు నృత్యాలు చేస్తూ తమ నాయకుడి పట్ల అభిమానాన్ని చాటుకున్నారు. బంజారా నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పార్టీ జెండాలతో జైజగన్ అంటూ నినాదాలతో పట్టణంలో హోరెత్తించారు.

ఫ్యాన్ స్పీడ్‌కు అడ్రస్ గల్లంతు..

ఫ్యాన్ స్పీడ్‌కు టీడీపీ అడ్రస్ గల్లంతేనని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సామినేని ఉదయభాను అన్నారు. నామినేషన్‌లో భాగంగా ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రంలో జన సునామీలో టీడీపీ, జనసేన, బీజేపీ కొట్టుకుపోతాయన్నారు. చంద్రబాబు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు వైఎస్సార్ సీపీ వైపు ఉన్నారని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అయితేనే తమకు మంచి జరుగుతుందని ప్రజలు బలంగా నమ్ముతున్నారన్నారు. మరోసారి రాష్ట్రానికి జగనన్న ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. జగ్గయ్యపేట అభివృద్ధి తానే చేశానని, ఇంకా అభివృద్ధి జరగాలంటే తనతోనే సాధ్యమన్నారు. టీడీపీ అభ్యర్థి శ్రీరాం తాతయ్య నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని సవాల్ విసిరారు. జగ్గయ్యపేట ప్రజల చిరకాల కోరిక అయిన ప్యాసింజర్ రైలు ఏర్పాటుకు రూ.1,450 కోట్లతో పనులు జరుగుతున్నాయన్నారు. గుంటూరు జిల్లా మాదిపాడు నుంచి ముక్త్యాలకు కృష్ణానదిపై రూ.60 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం జరుగుతుందన్నారు. రూ.14 కోట్లతో పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మవారి ఆలయం అభివృద్ధి చేశామని, జగనన్న ప్రభుత్వంలో నియోజకవర్గంలో సుమారుగా రూ. 2వేల కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అందాయన్నారు. పట్టణంలో రూ.3 కోట్లతో చెరువు అభివృద్ధి పనులు, రూ.75 లక్షలతో షాదీఖానా అభివృద్ధి, 6 గ్రామాల్లో ఇళ్ల స్థలాలు సంపిణీ చేయకుండా టీడీపీ వారు కోర్టుల ద్వారా అడ్డుకోవటం దారుణమన్నారు. నెడ్‌క్యాప్ కార్పొరేషన్ చైర్మన్ వేల్పుల రవికుమార్, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, వైద్యవిభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మెహబూబ్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, నియోజకవర్గ పరిశీలకులు నూతలపాటి హనుమయ్య, ఎన్టీఆర్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు సంపత్ విజిత, విమలాభాను ఫౌండేషన్ చైర్‌పర్సన్ విమలాభాను, మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హఫీజున్నీసా, కార్పొరేటర్ సామినేని వెంకటకృష్ణ ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భారీగా తరలివెళ్లిన ఏటిపట్టు గ్రామాల ప్రజలు

నందిగామ: వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి సామినేని ఉదయభాను నామినేషన్ దాఖలు కార్యక్రమానికి మండల పరిధిలోని ఏటిపట్టు గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలివెళ్లారు. నందిగామ మండలంలోని పది ఏటిపట్టు గ్రామాలు జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలో ఉండటంతో అన్ని గ్రామాల నుంచి బుధవారం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వెల్లువలా జగ్గయ్యపేట తరలివెళ్లారు. కార్లు, ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాల్లో సామినేని నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లారు.

ఉత్సాహంగా ఉదయభాను నామినేషన్

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా సామినేని ఉదయభాను బుధవారం ఉదయం 11.27 నిమిషాలకు నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన స్వగృహం నుంచి ర్యాలీగా తరలివచ్చి తహసీల్దార్ కార్యాలయంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.వెంకటేశ్వర్లుకు మూడు సెట్ల నామినేషన్ పత్రాలను అందజేశారు. కేడీసీసీబీ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటూరి రాజగోపాల్(చిన్నా), ఉదయభాను సోదరుడు సామినేని రవిచంద్ పాల్గొన్నారు.


ఫ్యాన్ గుర్తును చూపిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఉదయ భాను, కేశినేని, జగన్‌మోహనరావు

పెనుగంచిప్రోలు నుంచి తరలి వెళ్లిన శ్రేణులు..

పెనుగంచిప్రోలు: పేట పట్టణంలో బుధవారం జరిగిన వైఎస్సార్ సీపీ అభ్యర్థి సామినేని ఉదయభాను నామినేషన్‌కు వేలాదిగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వెళ్లారు. పెనుగంచిప్రోలు మండలం నుంచి నెడ్‌క్యాప్ చైర్మన్ వేల్పుల రవికుమార్, సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, మండల పార్టీ అధ్యక్షులు కనకపూడి భాస్కరరావు, పార్టీ మండల మాజీ అధ్యక్షులు వూట్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో జగ్గయ్యపేట స్వచ్ఛందంగా తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారెళ్ల విజయనరసింహారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ కన్నమాల శామ్యూల్ పాల్గొన్నారు.


న్యాయవాది వెంకటేశ్వరరావును పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేశినేని నాని, ఉదయభాను


జగ్గయ్యపేటలో ఉదయభాను నామినేషన్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీకి తరలివచ్చిన జనవాహిని


నందిగామ ర్యాలీలో ఆటో ఎక్కిన ఆడపడుచుల అభిమానం


పేటలో అభ్యర్థులకు గుమ్మడి కాయలతో దిష్టి తీస్తున్న మహిళలు


పేటలో ర్యాలీ ఎదుట బంజారా నృత్యాలు చేస్తున్న మహిళలు


పేటలో కోలాటం ఆడుతున్న మహిళలు

నామినేషన్లకు నేడు ఆఖరి రోజు

నందిగామ: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా నామినేషన్ల స్వీకరణ పర్వం కొనసాగుతోంది. ఇందులో భాగంగా బుధవారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఏ. రవీంద్రరావు తెలిపారు. రెండు నామినేషన్లు కూడా వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు అందజేసినవే అన్నారు. కాగా నామినేషన్ల స్వీకరణకు గురువారం చివరి రోజని రిటర్నింగ్ అధికారి తెలిపారు.

జగ్గయ్యపేటలో ఆరు నామినేషన్లు

జగ్గయ్యపేట అర్బన్: పేట నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థులుగా ఆరో రోజు బుధవారం ఆరు నామినేషన్లు దాఖలు అయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.వెంకటేశ్వర్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా సామినేని ఉదయభాను మూడు సెట్ల నామినేషన్ పత్రాలను ఆర్‌వోకు అందజేశారు. అలాగే ఆయన సతీమణి సామినేని విమలాభాను వైఎస్సార్ సీపీ తరఫున ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా పెనుగంచిప్రోలుకు చెందిన మాజీ సర్పంచ్ జిల్లేపల్లి సుధీర్‌బాబు నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) తరఫున మల్లెల గాంధీ నామినేషన్ దాఖలు చేశారు. ఏఆర్‌వో, పేట తహసీల్దార్ జి.శేషగిరి, ఎన్నికల సిబ్బంది శ్రీనివాసకుమార్ పాల్గొన్నారు.

కనుల పండువగా వేంకటేశ్వరుని రథోత్సవం

తిరుమలగిరి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్యక్షేత్రం వేంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి కనుల పండువగా స్వామి వారి రథోత్సవం జరిగింది. కల్యాణ ఉత్సవ మూర్తులను ప్రత్యేక రథంపై ఉంచి అర్చకులు పరాంకుశం వాసుదేవాచార్యుల వేద మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలనంతరం రథోత్సవాన్ని ప్రారంభించారు. ఆలయ వద్ద నుంచి గ్రామ పుర వీధుల్లో రథోత్సవం సాగింది. గ్రామస్తులు రథోత్సవానికి వారులుపోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చిలకల్లు ఎస్‌ఐ సతీష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నూతక్కి సాంబశివరావు, సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా కోలాట ప్రదర్శన ఆకట్టుకొంది.


రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

టీడీపీ కార్యకర్తల కవ్వింపు చర్యలు

జగ్గయ్యపేట: టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కవ్వింపు చర్యలకు పాల్పడటమే కాకుండా రాళ్లు రువ్వేందుకు ప్రయత్నించిన ఘటన పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా సామినేని ఉదయభాను నామినేషన్ వేసి తన ఇంటి నుంచి ర్యాలీగా మున్సిపల్ సెంటర్‌కు కార్యకర్తలు, నాయకులతో బయలు దేరారు. ర్యాలీ బంగారు కొట్ల సందు వద్దకు వచ్చేసరికి అక్కడే వేచి ఉన్న టీడీపీ అభ్యర్థి శ్రీరాం తాతయ్య అనుచరులు ర్యాలీగా వస్తున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. రాళ్లు రువ్వేందుకు ప్రయత్నించారు. దాదాపు 30 నిమిషాల పాటు అక్కడ ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. దీంతో పోలీసులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకుని వారిని చెదర గొట్టారు. జనసమూహాన్ని చూసి తట్టుకోలేక ఇలాంటి దుశ్చర్యలకు టీడీపీ వాళ్లు పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

నందిగామ: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎం. విశ్వనాథ్ పంచాయతీరాజ్ శాఖలో పని చేస్తున్న సిబ్బంది పనితీరును ప్రశంసించారు. మరింత ఉత్సాహంగా పనిచేసే మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బందితోపాటు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉదయభాను కార్యాలయ ఉద్యోగి మృతి



జగ్గయ్యపేట అర్బన్: గుండెపోటుతో స్థానిక ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ విభాగం చూసే ఉద్యోగి శ్రీనివాసరావు(45) బుధవారం రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. ఆయన మృతదేహాన్ని ఎమ్మెల్యే ఉదయభాను పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఉదయం నామినేషన్ కార్యక్రమంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్న ఆయన అకస్మాత్తుగా మృతి చెందటం పట్ల పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

సంక్షిప్త వార్తలు

● ఘనంగా రామస్వామి రాజా జయంతి

జయంతిపురం(జగ్గయ్యపేట): రామ్‌కో సిమెంట్స్ వ్యవస్థాపకుడు పీఏసీ రామస్వామి రాజా జయంతి వేడుకలు బుధవారం గ్రామంలోని కర్మాగారంలో సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విగ్రహానికి కర్మాగార ప్రెసిడెంట్ ఆశిష్‌కుమార్ శ్రీవాస్తవ పూలమాల వేసి నివాళులర్పించారు. పేదలకు దుప్పట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కంపెనీ వైస్‌ప్రెసిడెంట్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

● ఘనంగా సత్యసాయి ఆరాధనోత్సవాలు

నందిగామ: పట్టణంలోని సత్యసాయి మందిరంలో బుధవారం సత్యసాయి ఆరాధనోత్సవాలు ఘనంగా జరిగాయి. సత్యసాయి 99వ జయంతి వేడుకలలో భాగంగా 99 మంది గృహాలలో నిర్వహించిన జ్యోతి భజనల కార్యక్రమం ముగింపు సందర్భంగా సత్యసాయికి విశేష పూజలు నిర్వహించడంతోపాటు సామూహిక సత్యసాయి వ్రతాలు జరిగాయి.

● భారీగా మద్యం పట్టివేత

నందిగామ: అక్రమ మద్యం రవాణాకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని ఇన్‌స్పెక్టర్ హనీష్ హెచ్చరించారు. మండలంలోని దాములూరు సమీపంలో గల రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో బుధవారం నందిగామ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో మినీ వ్యాన్‌పై 306 మద్యం సీసాలను తీసుకువస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

● 100 కేసుల మద్యం సీసాలు పట్టివేత

తక్కెళ్లపాడు(జగ్గయ్యపేట): ఆటోలో తరలిస్తున్న 100 కేసుల మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్న ఘటన మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో చోటు చేసుకుంది. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌ఈబీ సూపరింటెండెంట్ సి. భార్గవ్ మాట్లాడుతూ దాడుల్లో భాగంగా తెలంగాణ నుంచి ఆటోలో అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.6 లక్షల విలువైన 100 మద్యం కేసులను పట్టుకున్నామన్నారు.

● పొత్తు ధర్మాన్ని విస్మరిస్తున్న టీడీపీ

నందిగామ: నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ పొత్తు ధర్మాన్ని విస్మరిస్తోందని కాపు సంక్షేమ సేన నియోజకవర్గ అధ్యక్షుడు కర్రి రమేష్ మండిపడ్డారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం, బీజేపీ, జనసేన పొత్తుతో ఎన్నికలకు వెళ్తున్నప్పటికీ నందిగామ నియోజకవర్గంలో మాత్రం దీనికి భిన్నంగా జరుగుతోందన్నారు. కూటమి ఉమ్మడి అభ్యర్థిగా తంగిరాల సౌమ్య నామినేషన్ దాఖలు చేసినప్పటికీ జనసేన పార్టీ క్యాడర్‌తో అంత సఖ్యతగా ఉండడం లేదన్నారు. ఈనెల 28న సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్తు నిర్ణయం ప్రకటిస్తామన్నారు.